సాక్షి ఆదిలాబాద్

మంగళవారం, 23, మే, 2023



క్రీడల్లో మెరిసేలా.. 8లో▶

గిరి విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచేలా ఐటీడీఏ ఆధ్వర్యంలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్‌లోని ఐపీ స్టేడియం, కొలాం ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్నాయి.



'సూపర్ స్పెషాలిటీ'కి మొండిచేయి

రిమ్స్ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు పేదలకు ఇప్పట్లో అందేలా కనిపించడం లేదు. అధునాతన వసతులతో కూడిన ఆస్పత్రిని ప్రారంభించిన ప్రభుత్వం వైద్యుల పోస్టుల భర్తీని మాత్రం విస్మరించింది. 10లో▶

గరిష్టం/కనిష్టం
42.0/30.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: విద్యను ఆయుధంగా మలిచి సమాజ అభ్యున్నతికి పాటుపడిన గొప్ప మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతిని కలెక్టరేట్ సమావేశ మందిరంలో దళిత అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, దళితసంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భాగ్యరెడ్డివర్మ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ఆర్డీవో రమేశ్ రాథోడ్, దళిత అభివృద్ధిశాఖ అధికారి సునీత కుమారి, వివిధ కులసంఘాల ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

6న అంబేద్కర్ మనుమడు జిల్లాకు రాక



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శేఖర్ తదితరులు

ఆదిలాబాద్‌రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనమడు ప్రకాశ్ అంబేద్కర్ జూన్ 6న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పాల్గొంటారని అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ దుర్గం శేఖర్ తెలిపారు. దళిత, అంబేద్కర్ సంఘాల నాయకులతో కలిసి జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని రాంలీల మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సందీప్, దీపక్, భూమన్న, తేజరావు, మనోజ్, ప్రజ్ఞ కుమార్, రాందాస్, పంచశీల్, అనిల్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నర్సింలు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని డీఈవో కార్యాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి జూన్ 5న బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నీలా దేవి, శశికళ, సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ, సుజాత్ ఖాన్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమ్మె నిర్ణయం ఉపసంహరణ

కైలాస్‌నగర్: రేషన్ డీలర్లు సమ్మె నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జూన్ 5 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు డీలర్లు ఇప్పటికే ప్రకటించారు. కాగా సోమవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సచివాలయంలో డీలర్ల జేఏసీ నాయకులతో నిర్వహించిన చర్చల్లో సానుకూల నిర్ణయం ప్రకటించడంతో సమ్మె నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో పాల్గొన్న జేపీఎస్‌లు (ఫైల్)

జేపీ..ఎస్

- సర్వీస్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వ నిర్ణయం
- ఫలించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరీక్షణ
- 16 రోజుల సమ్మెకు దక్కనున్న ప్రతిఫలం

కైలాస్‌నగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శి (జేపీఎస్)ల నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించేలా ప్రభుత్వం దృష్టి సారించింది. 16 రోజుల పాటు వారు చేసిన సమ్మెకు ప్రతిఫలం అందించే దిశగా చర్యలు చేపట్టింది. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ సోమవారం సమావేశమై జేపీఎస్‌ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన విధి విధానాల ఖరారుతో పాటు జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో ఓ కమిటీని వేయాలని పీఆర్ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయం అమల్లోకి వచ్చినట్‌లైతే జిల్లా వ్యాప్తంగా 323 మంది జేపీఎస్‌లు రెగ్యులర్ కార్యదర్శులుగా మారనున్నారు. అయితే ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం వారిలో కొంత ఆందోళన కలిగిస్తోంది. జేపీఎస్‌లతో సమానంగా విధులు నిర్వహించడంతో పాటు వారితో కలిసి పోరాడిన తమకు సైతం ప్రభుత్వం తీపి కబురు అందిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మంగళవారం ఓ స్పష్టత వచ్చే అవకాశముందని జేపీఎస్ సంఘ నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపై జూనియర్ పంచాయతీ కార్యదర్శుల్లో హర్షం వ్యక్తమవుతోంది. కాగా, తమను రెగ్యులర్ చేయడంతో పాటు నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ను సర్వీస్‌గా పరిగణించాలనే డిమాండ్లతో గత నెల 28 నుంచి ఈ నెల 13 వరకు జేపీఎస్, ఓపీఎస్‌లు సమ్మె చేపట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వ సూచనతో వారు ఆందోళన విరమించారు. తాజాగా వీరి క్రమబద్ధీకరణకు కలెక్టర్ నేతృత్వంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా అటవీ అధికారి, ఎస్పీ/డీసీపీలతో కూడిన కమిటీ వేయాలనే సీఎం ఆదేశాలతో జేపీఎస్‌ల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో..
మొత్తం గ్రామ పంచాయతీలు : 468
జూనియర్ పంచాయతీ కార్యదర్శులు :287
ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు : 36

సీఎంకు రుణపడి ఉంటాం



మా కష్టాన్ని గుర్తించి, సమ్మె విరమణ సందర్భంగా ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని నిర్ణయించడం హర్షణీయం. జేపీఎస్‌ల కుటుంబాలు సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. బంగారు తెలంగాణ పునర్నిర్మాణం కోసం మరింత రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తాం. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు రాష్ట్రానికి మరిన్ని అవార్డులు సాధించేలా నిర్విరామంగా కృషి చేస్తాం.

– కె.చంద్రశేఖర్, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు



జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. అయితే దీనిపై మాకు అధికారికంగా ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాల కనుగుణంగా వారి క్రమబద్ధీకరణకు సంబంధించి చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి

నేటి నుంచి నోట్ల మార్పిడి

- రూ.2వేల నోటు ఉపసంహరణ అనంతరం..
- బ్యాంకుల్లో మార్చుకునేందుకు అవకాశం
- రద్దీ ఉంటే ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేస్తామంటున్న అధికారులు

సాక్షి,ఆదిలాబాద్: రూ.2వేల కరెన్సీ నోటును చలామణి నుంచి పూర్తిగా ఉపసంహరిస్తున్నట్లు ఆర్‌బీఐ గత శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీటిని మార్చుకునేందుకు ప్రజలకు అవకాశం కల్పిస్తున్నారు. బ్యాంకులో ఒక దఫా రూ.20వేల పరిమితి వరకు.. అంటే రూ.2వేల నోట్లు 10.. ఇతర డినామినేషన్లలోకి మార్చుకునేందుకు మంగళవారం నుంచి షురూ చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో ఈ ఎక్స్ఛేంజ్ చేసుకోవచ్చు.

సెప్టెంబర్ 30 వరకు..

క్లీన్ నోట్ పాలసీ ప్రకారం రూ.2వేల కరెన్సీ నోట్లను చలామణి నుంచి ఉపసంహరించుకోవాలని నిర్ణయించారు. అయితే ఈ నోట్లను ఖాతాలో డిపాజిట్ చేసుకోవడానికి, లేదా బ్యాంకులో మార్చుకోవడానికి మంగళవారం నుంచి సెప్టెంబర్ 30 వరకు ప్రజలకు అవకాశం కల్పించారు. బ్యాంక్‌లో అకౌంట్ కలిగి ఉన్నవారు ఎవరైనా నేరుగా సమీప బ్యాంక్‌లో నోట్లను మార్చుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

రెగ్యులర్ కౌంటర్లే..

బ్యాంకుల్లో నోట్ల మార్పిడికి సంబంధించి ప్రస్తుతానికైతే రోజువారీగా జరిగే రెగ్యులర్ కౌంటర్లలోనే చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒకవేళ రద్దీ ఉంటే మాత్రం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లో గల ఎస్‌బీఐలో ఎక్కువ మొత్తం లావాదేవీలు జరుగుతాయి. నోట్ల మార్పిడి కూడా ఇక్కడే తాకిడి ఉండవచ్చని భావిస్తున్నారు.

డిపాజిట్ ఇప్పటికే మొదలు..

నిర్ణయం వెలబడి నాలుగు రోజులు గడవగా నోట్ల మార్పిడికి ఆర్‌బీఐ మంగళవారం నుంచి అవకాశం కల్పిస్తుంది. డిపాజిట్లకు సంబంధించి ఇప్పటికే మొదలుపెట్టినట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటివరకు ఏ మేరకు రూ.2వేల నోట్లు బ్యాంకులకు చేరాయనే సంఖ్య మాత్రం అధికారులు చెప్పడం లేదు. ఈ విషయంలో గోప్యత పాటిస్తున్నారు.

నోట్ల మార్పిడికి నిబంధనలేమి లేవు

నోట్ల మార్పిడికి ఎలాంటి నిబంధనలు లేవు. ఎవరైనా ఒక దఫా రూ.20వేల వరకు నోట్లను ఎక్స్ఛేంజ్ చేసుకోవచ్చు. మా బ్రాంచ్‌లో ఒకవేళ రద్దీ పెరిగితే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. ఎవరైనా సమీప బ్రాంచ్‌కు వెళ్లి ఒక దఫా పది నోట్లను మార్చుకోవచ్చు.

– శ్రీధర్, బ్రాంచ్ మేనేజర్, ఎస్‌బీఐ శివాజీచౌక్ బ్రాంచ్, ఆదిలాబాద్

యువత క్రీడల్లో రాణించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ఆదిలాబాద్: జిల్లా యువత రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లోనూ రాణించి జిల్లా పేరును ఇనుమడింప చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి సీఎం కప్– 2023 పోటీలను ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి యువత, క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తుందన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ ముందుకు సాగాలన్నారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ క్రీడాకారులు తమ శక్తి సామర్థ్యాలు ప్రదర్శించి అత్యుత్తమంగా రాణించాలన్నారు. తొలిరోజు కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, ఆర్చరీ, బాక్సింగ్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఈనెల 24 వరకు పోటీలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఆర్డీవో రమేశ్ రాథోడ్, డీఎస్పీ ఉమేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి, పీఈటీలు, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యేలు రామన్న, బాపూరావ్

అర్జీల వెల్లువ

- గ్రీవెన్స్‌కు తరలివచ్చిన దరఖాస్తుదారులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ వారం కిటకిటలాడింది. చాలా రోజుల తర్వాత కలెక్టర్ రాహుల్ రాజ్ గ్రీవెన్స్‌లో పాల్గొనడంతో అర్జీదారులు భారీగా తరలివచ్చారు. జిల్లా అధికారులు సైతం పూర్తి స్థాయిలో హాజరయ్యారు. బాధితులు సమర్పించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేస్తూ సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీదారులు ఒకే సమస్యపై పదేపదే ప్రజావాణికి రాకుండా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నటరాజ్, ఆర్డీవో రమేశ్ రాథోడ్, జెడ్పీ సీఈవో వి.గణపతి, డీఆర్డీవో కిషన్ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన వారి మాటల్లోనే..



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

దళితబస్తీ భూమి లాక్కుంటున్నారు..



నా పేరిట మండలంలోని పాలోది శివారులో 2.24 ఎకరాల భూమిని ప్రభుత్వం దళితబస్తీ కింద మంజూరు చేసింది. నాలుగేళ్లుగా ఆ భూమిని సాగు చేసుకుంటున్నం. అయితే పట్టా పాస్‌బుక్‌లో సర్వేనంబర్ తప్పుగా ప్రింటయింది. ఇటీవల మా భూమిలో అధికారులు బోరు వేయడంతో నీళ్లు మంచిగ పడ్డయ్. అప్పటి నుంచి ఆ భూమి తమదేనని, దాన్ని తిరిగివ్వాలంటూ ప్రభుత్వానికి భూమిని విక్రయించిన యజమాని మమ్మల్ని వేధింపులకు గురిచేస్తున్నాడు. దీనిపై తహసీల్దార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పట్టాపాస్‌బుక్‌లో సర్వే నంబర్‌ను సరిచేసి న్యాయం చేయాలని కోరుతున్నా.

– సూరం రాధ, వడ్డాడి, తాంసి

పింఛన్ వస్త లేదు..



గతంలో నాకు, నా భర్త గణేశ్‌కు ముసలోళ్ల పింఛన్ వచ్చేది. కుటుంబంలో ఒకరికే అని నా పింఛన్ ఆపేసిండ్రు. నా భర్త మూడేళ్ల కిందట చనిపోయిండు. నాకు తిరిగి పింఛన్ ఇవ్వాలని అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్న. ఎవరూ పట్టించుకుంట లేరు. ఇయ్యాల పెద్దసారుకు దరఖాస్తు ఇచ్చిన.

– సక్కుబాయి, కొలిపూర, ఆదిలాబాద్

భూసర్వే చేయడం లేదు



నాకు జైనథ్ మండల కేంద్రంలోని సర్వే నంబర్‌లో 447,448లో వ్యవసాయ భూమి ఉంది. దాన్ని 40ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన పట్టాలో భూమి విస్తీర్ణం తక్కువగా నమోదు చేశారు. సర్వే కోసం మీసేవలో చలానా కూడా కట్టిన. ఏడాదిన్నరగా తిరుగుతున్నా అధికారులు, సర్వేయర్ పట్టించుకోవడం లేదు.

– డి.పెద్దగంగన్న, జైనథ్

చదువుకునే అవకాశం కల్పించాలి



నేను అనాథను. అమ్మా నాన్న ఎవరూ లేరు. బంధువుల ఇంట్లో ఉండి నాలుగో తరగతి పూర్తి చేసిన. ఉన్నత చదువులు చదువుకోవాలని ఉంది. నాకు కేజీబీవీ లేదా మోడల్ స్కూల్‌లో ఐదో తరగతిలో సీటు ఇప్పించి చదువుకునే అవకాశం కల్పించాలని దరఖాస్తు ఇచ్చిన.

– ఆర్.పరిణీతి, కోలిపూర

కూలి గిట్టుతలే..!

- ప్రభుత్వం ప్రకటించింది రూ. 272
- జిల్లాలో మాత్రం రూ.139 నుంచి రూ.241 వరకే
- 'ఉపాధి' పనులపై ఎండల ప్రభావం



తాంసి మండలం పొన్నారి గ్రామ చెరువులో మట్టి తవ్వకాల్లో ఉపాధి కూలీలు

ఉపాధి హామీ అమలయ్యే మండలాలు: 17

మొత్తం జాబ్ కార్డులు: **1,74,036**

నమోదు చేసుకున్న కూలీలు: **3,64,475**

పనులకు హాజరవుతున్న కూలీలు: **48,494**

మండలం	రోజువారీ కూలి (రూ.లలో)	మండలం	రోజువారీ కూలి (రూ.లలో)
సిరికొండ	235	మావల	186
ఇంద్రవెల్లి	216	ఇచ్చోడ	179
నార్నూర్	213	బజార్‌హత్నూర్	182
నేరడిగొండ	208		
బోథ్	207	జైనథ్	183
గుడిహత్నూర్	214	ఆదిలాబాద్	166
ఉట్నూర్	203	తలమడుగు	158
గాదిగూడ	198	తాంసి	166
బేల	204	భీంపూర్	139

కైలాస్‌నగర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు రోజువారీ కూలి గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం రూ.272 కూలి ప్రకటించినప్పటికీ జిల్లాలో సగటు కూలి కేవలం రూ.200 మాత్రమే లభిస్తోంది. అయితే సిబ్బంది కూలీలకు నిర్దేశిత కొలతలు (మార్కింగ్) ఇస్తున్నప్పటికీ ఆ దిశగా పనులు చేయకపోవడంతో గిట్టుబాటు దక్కడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. కేంద్ర ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేయడం, పనుల ప్రగతిపై పకడ్బందీగా ఆడిట్ నిర్వహిస్తుండటంతో క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు పక్కాగా కొలతలు నమోదు చేస్తున్నారు. మరోవైపు ఎండల తీవ్రతతో కూలీలు పనుల్లో త్వరగా అలసిపోతున్నారు. ఫలితంగానే ప్రభుత్వం ప్రకటించిన కూలి వారికి దక్కడం లేదని తెలుస్తోంది.

భానుడి ప్రభావం..

డీఆర్డీఏ అధికారులు ఈ ఆర్థిక సంవత్సరానికి గాను మట్టి పనులను ఎక్కువగా చేపడుతున్నారు. అటవీ ప్రాంతాలతో పాటు వ్యవసాయ క్షేత్రాలలో గుర్తించిన ఈ పనుల్లో అధికారులు కూలీలకు నిర్దేశిత కూలి గిట్టుబాటయ్యే విధంగా మార్కింగ్ ఇస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూలీలు త్వరగా అలిసిపోయి మార్కింగ్ ప్రకారం పూర్తి చేయడం లేదు. దీనికి తోడు కేంద్రం ఉపాధి పనుల ప్రగతిపై నిర్వహించే ఆడిట్‌ను పకడ్బందీ చేసింది. నిధుల దుర్వినియోగం అయితే సంబంధిత ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేస్తున్నారు. దీంతో ఎఫ్ఏలు సైతం తమకెందుకు తల నొప్పి అంటూ కొలతలు పక్కాగా నమోదు చేస్తున్నారు. ఫలితంగా కూలీలకు గిట్టుబాటు కాని పరిస్థితి.

అత్యధికం రూ.241

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్, మే 10వ తేదీ వరకు నిర్వహించిన పనులను పరిశీలిస్తే కూలీలకు సరాసరి కూలి రూ.201 మాత్రమే లభిస్తోంది. ఈ నెలన్నర వ్యవధిలో అత్యధికంగా ఇంద్రవెల్లి మండలంలో రూ.241 కూలి లభించగా.. అత్యల్పంగా భీంపూర్ మండలంలో రూ.141 లభించింది. తలమడుగు, తాంసి, భీంపూర్ ఈ మూడు మండలాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి . ఇక్కడ సగటు కూలి రూ.160 దాటక పోవడం గమనార్హం. సిరికొండ, ఇంద్రవెల్లి, నార్నూర్, నేరడిగొండ, బోథ్ మండలాల్లో సగటున రూ. 200పైన కూలి లభిస్తోంది. ఉదయం ఆరు గంటలకు పనులకు వెళుతున్న కూలీలు ఎండ ముదరక ముందే పదిన్నర గంటల లోపే ఇంటి ముఖం పడుతున్నారు. దీంతో ఆశించిన మేరకు కూలి గిట్టుబాటు కావడం లేదని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

పనిచేసినంత మేరకు కూలి

కూలీలకు గిట్టుబాటు అయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది మార్కింగ్ వేసి ఇస్తున్నారు. దాని కనుగుణంగా పనులు చేపట్టాల్సి ఉంటుంది. అయితే పనిచేసినంత మేరకు కొలతల ప్రకారం కూలి చెల్లించడం జరుగుతుంది. పలు మండలాల్లో రూ.200పైనే కూలి లభిస్తోంది. ఒకటి, రెండు మండలాల్లో మాత్రమే అంతకు తక్కువగా వస్తుంది.

– రవీందర్ రాథోడ్, ఏపీడీ, డీఆర్డీఏ

వీవోఏల కలెక్టరేట్ ముట్టడి

- ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్

కైలాస్‌నగర్: తమకు కనీస వేతనాలు చెల్లించడంతో పాటు ఉద్యోగభద్రత కల్పించాలనే డిమాండ్లతో 37 రోజులుగా సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏలు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యాలయ మెయిన్ గేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న డీఆర్డీవో కిషన్ అక్కడికి వచ్చి వారితో మాట్లాడారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్, దత్తు మాట్లాడుతూ రూ.26వేల కనీస వేతనం సెర్ప్ ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చంద్రకళ, లక్ష్మణచారి, పుష్ప, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన వీవోఏలు

కేజీబీవీ టీచర్లను క్రమబద్ధీకరించాలి

- కలెక్టరేట్ ఎదుట టీఎస్ యూటీఎఫ్ ధర్నా

కైలాస్‌నగర్: కేజీబీవీలు, యూఆర్ఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ ఆరోపించారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్న కేజీబీవీ ఎస్‌వోలు, సీఆర్టీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వడంతో పాటు వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జూన్ 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపడుతామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్, కిష్టన్న, శ్రీనివాస్, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయులు

జొన్న కొనుగోలులో పరిమితులొద్దు

కైలాస్‌నగర్: రైతులు పండించిన జొన్న పంటను పరిమితి నిబంధన లేకుండా పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జొన్న కొనుగోలు విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ రైతులతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. వీరి ఆందోళనతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకొని వారిని పక్కకు తొలగించారు. అనంతరం అదనపు కలెక్టర్ నటరాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొర్రన్న మాట్లాడారు. యాసంగిలో పంటల దిగుబడులపై వ్యవసాయ శాఖ ఎకరానికి 15 క్వింటాళ్ల జొన్నలు వస్తాయని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందన్నారు. ఆ నివేదికను పక్కన పెట్టి కేవలం 5.16 క్వింటాళ్లు మాత్రమే కొంటామని ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం సరికాదన్నారు. వ్యవసాయ శాఖ నివేదిక ఆధారంగా ఎకరానికి 15 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన రైతులు

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక



సీఎం కేసీఆర్‌కు అన్నబాహుసాఠే చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

కుంటాల: మహారాష్ట్ర అన్నాబాహుసాఠే నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్‌కు ఈ సందర్భంగా వారు అన్నబాహు సాఠే చిత్రపటాన్ని అందజేశారు. ఆదిలాబాద్ అన్నబాహుసాఠే అధ్యక్షుడు ఉద్ధవ్ కాంబ్లే, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తం బాలేరావు, బీఆర్ఎస్ సోషల్‌మీడియా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంటావార్ దశరథ్, పార్టీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ గాడేకర్ రమేశ్, నాయకులు సాయినాథ్ గాయక్‌వాడ్, బీఎస్ఎస్ న్యూస్ డైరెక్టర్ శంకర్ ఉన్నారు.

పది మంది వీవోఏలపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగ భద్రతను కల్పించాలనే డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌ను ముట్టడించిన పది మంది వీవోఏలపై టూటౌన్ ఎస్సై ఊశన్న కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయడంతోపాటు రోడ్డుపై బైఠాయించి ట్రా ఫిక్‌కు అంతరాయం కలిగించారు. అక్కడికి చేరుకున్న ఎస్సై వారికి నచ్చజెప్పిన వినకపోవడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పేకాట ముక్కలు, నగదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని టూటౌన్ పరిధిలో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇంద్రానగర్ భీంసరి శ్మశానవాటిక ప్రాంతంలో సోమవారం సాయంత్రం పేకాట ఆడుతుండగా దాడులు జరిపి నలుగురిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.3,020 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై టూటౌన్‌పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈదాడుల్లో సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు శిక్ష తోపాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ఇన్‌చార్జి జడ్జి డాక్టర్ శివరాంప్రసాద్ సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జైనథ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక తన స్నేహితులతో ఆడుకుంటుంది. ఆ సమయంలో నిరాల గ్రామానికి చెందిన బోయర్ ఆకాశ్ ఆ బాలికకు మొబైల్ ఫోన్ చూపిస్తూ తన ఇంటికి తీసుకెళ్లాడు. ఆమె స్నేహితులను బయటికి పంపించి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంటికెళ్లిన బాలిక తన తల్లికి ఈ విషయాన్ని తెలియజేయడంతో జైనథ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై వై.రామయ్య కేసు నమోదు చేశారు. ప్రత్యేక పీపీ రమణారెడ్డి 14 మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయగా జడ్జి తీర్పునిచ్చారు.

క్రీడల్లో మెరిసేలా..

- గిరి విద్యార్థులకు శిక్షణ
- ఐటీడీఏ ఆధ్వర్యంలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు
- సమగ్రాభివృద్ధి ధ్యేయంగా ప్రత్యేక దృష్టి

గిరిజన గూడేల్లో నివసించే గిరి విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చేలా ఐటీడీఏ ఆధ్వర్యంలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, కొలాం ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న ఈ శిబిరాల్లో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, రెండు గిరి క్రీడా పాఠశాలల విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. పలు క్రీడాంశాల్లో తర్ఫీదు ఇస్తుండడం, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని అంశాల మేళవింపుతో శిబిరాల్లో ట్రైనింగ్ ఇస్తున్నారు.

– ఆదిలాబాద్

ఏడు క్రీడాంశాలు..20 రోజులు

బాక్సింగ్, స్విమ్మింగ్, జూడో, హాకీ, ఆర్చరీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్.. ఏడు క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రతీ అంశంలో ఒక్కో శిక్షకుని ద్వారా వారికి మెలకువలు నేర్పుతున్నారు. ఆర్చరీని ఆదిలాబాద్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో, ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో స్విమ్మింగ్, బాక్సింగ్, జూడో, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ క్రీడల్లో శిక్షణ కొనసాగుతోంది. మొత్తం 135 మంది క్యాంప్‌లో ఉండగా 60 మంది బాలికలు, 75 మంది బాలురులు ఉన్నారు. ఆదిలాబాద్, చించుఘాట్, సైద్‌పూర్, ఉట్నూర్, జాతర్ల గిరి క్రీడ పాఠశాలల విద్యార్థులకు 20 రోజులు ఈ శిక్షణ అందజేసేలా ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నారు.

సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా..

గిరి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం పెంపొందించేలా వివిధ అంశాలను వారికి తెలుపుతున్నారు. కెరీర్ గైడెన్స్, డయల్ 100, 1098, సైబర్ నేరాలు, మోటివేషనల్ తరగతులు, సాహిత్య అంశాలపై అవగాహన కల్పించడం, మూఢనమ్మకాలపై భయాన్ని పోగొట్టేలా కార్యక్రమాలు చేపట్టారు. క్రీడల్లో ఉన్నత స్థానానికి ఎదిగిన గొప్ప క్రీడాకారుల జీవిత చరిత్రను ప్రతి ఆదివారం చిత్ర మాధ్యమం ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆర్చరీ అభ్యసిస్తున్న విద్యార్థులు

పతకాలే లక్ష్యంగా..



గిరి క్రీడాకారుల్లో ప్రతిభ ను వెలికి తీయాలనే ఉద్దేశంతో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చే శాం. క్రీడాకారులతో పాటు విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఇంటర్ సొసైటీస్ లీగ్ రాష్ట్ర గిరిజన క్రీడోత్సవాల్లో గతంలో ఐటీడీఏ పరిధిలోని విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచారు. ఈసారి ప్రథమ స్థానం, జాతీయ స్థాయి గిరి క్రీడా పోటీల్లో పతకాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– పార్థసారథి, జిల్లా గిరిజన క్రీడల అధికారి

ఆటల్లో ఆసక్తి



గిరి విద్యార్థుల్లో ఆటలపై ఆసక్తి ఉంది. వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ సమ్మర్ క్యాంపు వారికి ఎంతగానో ఉపయోగం. రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో సాధించిన విద్యార్థులు స్నేహభావంతో మెలుగుతూ ఎన్నో కొత్త విషయాలు నేర్చుకునేలా శిక్షణ ఇస్తున్నాం. వారికి ప్రత్యేక మెనూ ద్వారా ఆహారం అందిస్తున్నాం.

– రాము, అథ్లెటిక్స్ కోచ్

పంచ్‌లు వేయాలి



బాక్సింగ్ నేర్చుకోవాలంటే ప్రత్యర్థికి భయపడకూడదు. ధైర్యంగా పంచులు కురిపించాలి. అప్పుడే విజయం సాధించవచ్చని అర్థం చేసుకున్నా. సీనియర్ క్రీడాకారులు సలహా ఉపయోగపడుతాయి. అవకాశం కల్పిస్తే ఈ క్రీడల్లో రాణిస్తాననే నమ్మకం ఉంది.

– ఎం.సంధ్య, ఆశ్రమ పాఠశాల, చించుఘాట్

పతకాలు సాధిస్తా



నేను రన్నింగ్‌లో 100, 200 మీటర్ల పోటీల్లో జాతీయ స్థాయికి ప్రాతినిధ్యం వహించా. పాట్నా, అస్సాంలో జరిగిన పోటీల్లో 7వ స్థానం సాధించా. ఆటల్లో పొరపాట్లను సరిదిద్దుకోవడానికి ఈ క్యాంప్ ఎంతగానో దోహదం చేస్తుంది. కోచ్ మెలకువలు నేర్పుతున్నారు. త్వరలో జరిగే సీఎం కప్ క్రీడా పోటీల్లో పతకాలు సాధిస్తా.

– మడావి సోము, జాతర్ల గిరి క్రీడ పాఠశాల

స్విమ్మింగ్‌లో రాణిస్తా



వేసవి శిక్షణ శిబిరంలో స్విమ్మింగ్ ఎంచుకున్నా. ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ కల్పిస్తున్నారు. బటర్‌ఫ్లై, బ్యాక్‌స్ట్రోక్, ఫ్రీస్టైల్ అంశాలు ఉంటాయని తెలుసుకున్నా. హాకీతో పాటు స్విమ్మింగ్‌లో కూడా రాణించాలని అనుకుంటున్నాను. మొదటిసారి అయినా ఎలాంటి బెరుకు లేకుండా తర్ఫీదు నిస్తున్నారు.

– వంశీకృష్ణ, ఆశ్రమ పాఠశాల, ఆదిలాబాద్

జాతీయ స్థాయి లక్ష్యంగా..



ఆర్చరీలో గతేడాది డిసెంబర్‌లో ఏటూరునగరంలో జరిగిన ట్రైబల్ స్టేట్ స్పోర్ట్స్ మీట్‌లో ఆడాను. పోటీల్లో 30 మీటర్ల ఈవెంట్‌లో బంగారు పతకం సాధించా. ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్నా. 40 మీటర్ల లక్ష్యంగా పెట్టుకున్నా. సైట్, ఆరో రిలీజింగ్‌తోపాటు కోచ్ నేర్పిస్తున్న కొత్త టెక్నిక్స్‌పై శ్రద్ధ కనబర్చుతున్నా. జాతీయ స్థాయిలో సత్తా చాటేలా లక్ష్యం పెట్టుకున్నా.

– ఎస్.శ్రీజ, ఆశ్రమ పాఠశాల, చించుఘాట్

మరిన్ని పతకాలు తెస్తా..



జావెలిన్ త్రో క్రీడల్లో ఇప్పటికే రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించా. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నా. షాట్ పుట్ ఈవెంట్లో సిల్వర్ మెడల్ వచ్చింది. ఈ క్యాంపుతో తరచూ క్రీడ సాధన చేస్తున్నా. జాతీయస్థాయి పోటీల్లో మరిన్ని పతకాలు సాధిస్తాను.

– శ్రీకాంత్, జాతర్ల గిరి క్రీడా పాఠశాల

ఆర్చరీ ఎంచుకున్నా..



ఆశ్రమ పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, క్రికెట్ పోటీలు ఆడాను. వేసవి శిబిరంలో ఆర్చరీ క్రీడను ఎంచుకుని శిక్షణ తీసుకుంటున్నా. దీనికి సంబంధించి కోచ్ ప్రత్యేకంగా వివరిస్తున్నారు. దీంతో ఉత్సాహంగా నేర్చుకుంటున్నాను.

– నాగోరావు, ఆశ్రమ పాఠశాల, సైద్‌పూర్

భవిష్యత్తులోనూ..



మేము ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నాం. అవగాహన లేక జూడో నేర్చుకోవడంలో తడబడ్డాం. కోచ్ ప్రతీ అంశాన్ని అర్థమయ్యే రీతిలో చెప్పడంతో సులభంగా నేర్చుకునే అవకాశం కలుగుతోంది. భవిష్యత్తులో ఈ క్రీడను ఆడాలని అనుకుంటున్నాం.

– జంగుబాయి, దేవుబాయి, భాగ్యజ్యోతి, సరోజ

కొత్త టెక్నిక్స్ నేర్చుకున్నాం



మేము క్రీడా పాఠశాల విద్యార్థులమే. ఈ క్యాంప్‌లో సీనియర్ క్రీడాకారుల మధ్య హాకీ క్రీడను అభ్యసించే అవకాశం లభించింది. కొత్త టెక్నిక్స్ నేర్చుకున్నాం. ఆటల్లో సైతం వేగం పెరిగింది. ఉత్సాహంగా క్యాంప్ సాగుతుంది.

– జాదవ్ యువరాజ్, జాదవ్ చరణ్, స్పోర్ట్స్ స్కూల్, ఉట్నూర్

సెల్‌ఫోన్ పోతే ఆందోళన వద్దు

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: ఎవరైన సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే ఆందోళన చెందవద్దని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. 20 పోలీస్ స్టేషన్ల పరిధిలో 51 మంది ఫోన్లు పోగొట్టుకోగా, సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా పోలీసులు గుర్తించారు. జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో సోమవారం 15 మందికి తిరిగి సెల్‌ఫోన్లు అందజేశారు. మిగతా 36 సెల్‌ఫోన్లను వివిధ పోలీస్‌స్టేషన్లలో అప్పగించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో లేదా మీసేవ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. మొదట అదే నెంబర్‌తో కొత్త సిమ్ తీసుకుని, https:// www. ceir. gov. in/ వెబ్‌సైట్ ఓపెన్ చేసి ఫోన్ ఐఎంఈఐ నంబర్ అప్‌లోడ్ చేసి, రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ అని నమోదు చేసుకోవాలన్నారు. తర్వాత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు. పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి అందజేయడంలో కృషిచేసిన ఐటీ కోర్ విభాగం సిబ్బందిని అభినందించారు. ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: గిరిజన అర్జీలు సత్వరం పరిష్కరించాలని డీడీ డా.దిలీప్‌కుమార్ అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖల అధికారుల అర్జీలను పరిశీలించి గిరిజనులకు వెంటనే న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- స్వయం ఉపాధికి ఆర్థికసాయం మంజూరు చేయాలని ఆసిఫాబాద్ మండలం మలన్‌గోంది గ్రామానికి చెందిన కె.సోము అర్జీ సమర్పించాడు. ఝరి గ్రామానికి చెందిన చంద్రకళ తన కుమార్తెకు గురుకులంలో సీటు ఇప్పించాలని దరఖాస్తు చేసింది.
- ఆశ్రమ పాఠశాలలో సీటు ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలం మామిడిగూడ గ్రామానికి చెందిన మంజులత విన్నవించింది.



అర్జీలు స్వీకరిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

- తన పేరిట భూమి పట్టా మంజూరు చేయాలని ఇంద్రవెల్లి మండలం హర్కపూర్ గ్రామానికి చెందిన మెస్రం గిరిజాబాయి కోరింది.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

ఇంద్రవెల్లి: మండలంలోని దోడందా గ్రామంలో కొత్తగా నిర్మించిన జగదాంబ, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. శేఖర్ మహారాజ్, రాంసింగ్‌బాబా ఆధ్వర్యంలో పూజలు చేశారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయిలు హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారిని గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో పయనించాలన్నారు. ప్రేమ్‌సింగ్ మహారాజ్, నాయకుడు మర్సుకోల తిరుపతి, ఎంపీటీసీ స్వర్ణలత, గ్రామపెద్దలు పవార్ దూదిరాం తదితరులు ఉన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాఘాపూర్‌లో నైతం రామి, కుమారుడిపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన ఆత్రం నాందేవ్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆత్రం నాందేవ్ వారి ఇంటికి అనుకోని ఉన్న నైతం కవిత భర్త రామి, కుమారుడిపై మద్యం తాగి దాడి చేశారు. పాత కక్ష్యలను మనుసులో పెట్టుకుని దాడికి పాల్పడ్డారు. దీంతో వారికి గాయాలయ్యాయి. కవిత ఫిర్యాదు మేరకు నాందేవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మరో ఇద్దరిపై..

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రణదీవేనగర్‌కు చెందిన బొయర్ లక్ష్మణ్‌పై దాడి చేసి గాయపర్చిన ఇద్దరు అన్నదమ్ముళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..బొయర్ లక్ష్మణ్ ఈనెల 17న కౌన్సిలర్ ఇంటికి వెళ్తున్న క్రమంలో అదే కాలనీకి చెందిన నైతం పరమేశ్వర్ మద్యం తాగి ఆయనతో గొడవపడి దాడి చేశాడు. అంతలో పరమేశ్వర్ సోదరుడు వికాస్ మా అన్నయ్యతో గొడవకు దిగిన లక్ష్మణ్‌పై దాడి చేయడంతో కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు లక్ష్మణ్‌ను ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం సోమవారం బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని తిప్ప పంచాయతీ పరిధిలోని బోరింగ్‌గూడకు చెందిన కొడప కానీరాం (46) చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఎస్సై నాగనాథ్ కథనం ప్రకారం.. కానీరాం మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 20న మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. ఐదుగురు పిల్లలున్నారు.. రోజు తాగి రావడం ఏంటని భార్య కన్నీబాయి మందలించింది. మనస్తాపం చెందిన కానీరాం శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. భార్య కన్నీబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా ధమడ్‌దేవి గ్రామానికి చెందిన కినాకే రతన్ (55) పాముకాటుతో సోమవారం మృతిచెందాడు. టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ మదన్ కథనం ప్రకారం.. ఉదయం 10గంటల ప్రాంతంలో ఎడ్లకొట్టంలో పశుగ్రాసం వేయడానికి వెళ్లిన రతన్ కాలికి పాము కాటేసింది. కుటుంబీకులు హుటాహుటిన పాటన్‌బోరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి దివ్యాంగ బాలుడి మృతి



వాకుడే నవ్‌నాథ్ మృతదేహం

నర్సాపూర్(జి): చెరువులో పడి దివ్యాంగ బాలుడి మృతిచెందిన ఘటన మండలంలోని కుస్లీ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా తలియచివాడి గ్రామానికి చెందిన రాందాస్ కుటుంబం ఆరేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నర్సాపూర్(జి) మండలం కుస్లీ గ్రామానికి వచ్చారు. కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు వాకుడే నవ్‌నాథ్ (15) పుట్టుకతో అంగవైకల్యం ఉంది. నవ్‌నాథ్ ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన ఒకరు కాలకృత్యాల కోసం ఎల్లమ్మ చెరువు వైపు వెళ్లగా చెరువులో బాలుడి శవం కనిపించింది. గ్రామస్తులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెళ్లి చూడగా నవ్‌నాథ్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాందాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ తెలిపారు.